హైదరాబాద్ కలెక్టరేట్‌లోని పార్లమెంటరీ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని గురువారం ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ ఎస్‌సెంథిల్ కుమారన్ సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్, జిల్లా రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి ఉన్నారు. *– సిటీబ్యూరో, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ)*

## నేడు సీసీఎంబీలో జిజ్ఞాస సదస్సు

సిటీబ్యూరో, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలర్ బయాలజీలో శుక్రవారం జిజ్ఞాస కార్యక్రమంలో టెక్నికల్ చర్చాగోష్టి నిర్వహించనున్నారు. సీసీఎంబీలో జరిగే ఈ సదస్సులో బయాలజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై ప్రసంగించనున్నారు. వర్చువల్ వేదిక ద్వారా నిర్వహించే ఈ సదస్సులో సీసీఎంబీకి చెందిన పరిశోధకులు డా.దివ్యతేజ్ సౌపాటి బిగ్ డేటా అండ్ పాండమిక్ ప్రివెన్షన్ అంశంపై చర్చించనున్నారు. ఫ్యూచరిస్ట్ ఫై డేస్ పేరిట సీఎస్ఐఆర్ జిజ్ఞాస ప్రతి శుక్రవారం శాస్త్ర, సాంకేతిక అంశాలపై చర్చాగోష్ఠి నిర్వహిస్తున్నది. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే సదస్సులో పాల్గొనేందుకు ఇంటర్, డిగ్రీ విద్యార్థులు అర్హులని వెల్లడించారు.

## బీబీఏ పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 18 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీబీఏ (అనలిటిక్స్) పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బీబీఏ అనలిటిక్స్ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు జూన్ 7వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నప్పటికీ, పరీక్షలను నిర్వహించే తేదీలలో మార్పులు చేసినట్లు చెప్పారు.

**పీజీ డిప్లొమా ఇన్ లా కోర్సుల పరీక్షా తేదీల ఖరారు**

ఓయూ పరిధిలోని వివిధ పీజీ డిప్లొమా ఇన్ లా కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేశారు. ఈ కోర్సుల మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**ఎంబీఏ పరీక్షా ఫలితాల విడుదల**

ఓయూ పరిధిలోని ఎంబీఏ (సీబీసీఎస్) మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. పూర్తి వివరాలు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చన్నారు.

## వీఐటీ అడ్మిషన్ టెస్ట్‌కు సర్వం సిద్ధం

సిటీబ్యూరో, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ): వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ)లో బీటెక్ చదివేందుకు నిర్వహిస్తున్న వీఐటీ ఎంట్రెన్స్ టెస్ట్‌కు సర్వం సిద్ధం చేసినట్లుగా నిర్వాహకులు తెలిపారు. ఆన్‌లైన్ వేదికగా నిర్వహించే వీఐటీఈఈఈ పరీక్షను దేశంలోని 125 నగరాలతోపాటు, విదేశాల్లోని ఆరు నగరాల్లోనూ నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఏప్రిల్ 19 నుంచి 30 వరకు జరిగే ఈ పరీక్షలు జరగనుండగా, మే 3న ఫలితాలను వెల్లడించనున్నట్లుగా చెప్పారు. అదే రోజున ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవుతుందని వివరించారు.

## ఉత్సాహంగా హెరిటేజ్ వాక్

*సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) :* ప్రపంచ హెరిటేజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని.. బల్దియా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన హెరిటేజ్ వాక్ ఉత్సాహంగా సాగింది. దారుల్‌షిఫా నుంచి ప్రారంభమైన ఈ వాక్ సాలార్జంగ్ మ్యూజియం మీదుగా ఉస్మానియా ఆస్పత్రి వద్ద ముగిసింది. ఈ సందర్భంగా కమిషనర్ రొనాల్డ్ రాస్ మాట్లాడుతూ నగరంలో ప్రాముఖ్యమున్న వారసత్వ సంపదను కాపాడేందుకు విశేష కృషి చేస్తున్నట్లు చెప్పారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో రూ.18.33 కోట్ల వ్యయంతో మోజంజాహి మార్కెట్, మౌలాలి కమన్, క్లాక్ టవర్ పనులు పూర్తి చేశామన్నారు. చార్మినార్ చుట్టూ ఉన్న కమన్ల పునఃనిర్మాణ పనులకు ప్రతిపాదించినట్లు చెప్పారు. ఈ వాక్‌లో జోనల్ కమిషనర్లు రవి కిరణ్, స్నేహ శబరీష్, అభిలాష అభినవ్, వెంకన్న, పంకజ, అడిషనల్ కమిషనర్ శ్రీవాత్సవ, చంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెట్లబావిలో.. హెరిటేజ్ వాక్

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 18 : భారతీయ ఇతిహాసాలు, పురాణాల్లో పురాతన వారసత్వ సంపద, నీటి సంరక్షణ, సంస్కృతి ఔన్నత్యాన్ని అద్భుతంగా వివరించడం జరిగిందని సుధారెడ్డి ఫౌండేషన్, ఎంఈఐఎల్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ పి.సుధారెడ్డి అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా బన్సీలాల్‌పేట్‌లోని మెట్ల బావి వద్ద గురువారం సాయంత్రం 'హెరిటేజ్ వాక్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా తెలంగాణ సాంస్కృతిక, పర్యాటక శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరి శైలజా రామయ్యర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలో సాలార్‌జంగ్ మ్యూజియంలోని నాణెల విభాగాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. బన్సీలాల్‌పేట్‌లోని పురాతన మెట్లబావిని ఎంతో శ్రమించి పునరుద్ధరించడం వలన పరిసరాలలో భూగర్భ జలాల అభివృద్ధి జరిగిందని తెలిపారు. అనంతరం పరంపర సంస్థ కళాకారుల ద్వారా 'షన్మత' సందేశాత్మక, నృత్య రూప ప్రదర్శన అందరినీ అలరించింది.

# జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలి

- ఎన్నికల విధుల నుంచి ఎవ్వరికీ మినహాయింపు లేదు
- రెండో విడత శిక్షణకు సిద్ధం కావాలి
- నోడల్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి సూచన

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధుల నిర్వహణకు జిల్లాలో నియమించిన ఆయా నోడల్ అధికారులు తమ తమ విధులను పూర్తి అవగాహనతో బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ సంబంధిత నోడల్ అధికారులను ఆదేశించారు. గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్, స్వీప్, మ్యాన్ పవర్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, పీడబ్ల్యూడీ, తదితర నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులతో ఆయా నోడల్ అధికారుల పనితీరుపై కూలంకషంగా చర్చించారు. ఆయా కమిటీల నోడల్ అధికారులకు సంబంధిత విషయాలలో పలు సూచనలు చేశారు. అదేవిధంగా సి–విజిల్, ఎస్‌ఎంఎస్ మానిటరింగ్ సెల్, ఎన్‌జీఎస్ పోర్టల్, ఎన్ కోర్ యాప్, క్యూ మేనేజ్‌మెంట్, ఓటరు టర్న్ ఔట్, తదితర ఏర్పాట్లపై రొనాల్డ్ రాస్ చర్చించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రింటింగ్ జాగ్రత్తగా చేయించాలని, ఫారం–2 ఆమోదం పొందిన ఉద్యోగులు అందరూ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేలా ఆయా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారికి సూచించారు.

**'సి'విజిల్ ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి**

'సి' విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. ఎన్నికల సిబ్బందికి రెండో విడత శిక్షణకు సిద్ధం చేసుకోవాలని సంబంధిత నోడల్ అధికారికి సూచించారు. ఎన్నికల విధుల నుండి ఎవరికీ ఎలాంటి మినహాయింపు లేదన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఆయా నోడల్ అధికారులు అప్రమత్తతతో జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, ఎన్నికల అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతయారు, చంద్రకాంత్ రెడ్డి, ఆయా నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**వారసత్వ సంపదను కాపాడుకుందాం**

సుల్తాన్‌బజార్, ఏప్రిల్18: నగరంలో ప్రాముఖ్యత గల వారసత్వ సంపదను కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అన్నారు. గురువారం అంతర్జాతీయ హెరిటేజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో దారుల్‌షిఫా నుంచి ఉస్మానియా దవాఖాన చింత చెట్టు వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్‌లో ఆయన జోనల్ కమిషనర్లు, హెచ్‌ఓడీలు, చారిత్రక ప్రియులతో కలిసి పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల శిక్షణ తరగతులకు డుమ్మా..!!

### పది మందిపై చర్యలు తీసుకున్న ఎన్నికల అధికారి

సిటీబ్యూరో, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల విధులకు నియమించబడిన అధికారులు శిక్షణ తరగతులకు గైర్హాజరైన వారిపై జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ చర్యలు తీసుకున్నారు. శిక్షణ తరగతులకు గైర్హాజరైన సిబ్బందిపై ఆర్‌పీ యాక్ట్ 1951 సెక్షన్ 134 ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు కమిషనర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాంపల్లి సహకార, రిజిస్టార్ కార్యాలయానికి సంబంధించిన జూనియర్ అసిస్టెంట్ సయ్యద్ ఇలియాస్ అహమ్మద్, ఓయూ సీనియర్ అసిస్టెంట్ జి.రవిప్రసాద్, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.కృష్ణయ్య, డీఈఓ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ మజీద్ ఖాన్, ఖాజీపురా ప్రభుత్వ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ మీర్జా నసీర్ బేగ్, పంజాగుట్ట డివిజన్ కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ డీఎస్‌టీఓ కె.నాగరాజు, కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ పంజాగుట్ట డివిజన్ జూనియర్ అసిస్టెంట్ కె.మధుసూదన్ కుమార్, టీచర్ సయ్యద్ అబ్దుల్లా జుబేర్, హజ్ కమిటీ జూనియర్ అసిస్టెంట్ కె.మహేశ్, ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన సీనియర్ అసిస్టెంట్ చిలివేరు శంతన్‌కుమార్‌లపై చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికల శిక్షణ తరగతులకు గైర్హాజరైన వారికి ఈ నెల 20వ తేదీన మళ్లీ శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని, అప్పటికీ గైర్హాజరైన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# భూదాన్ బోర్డును ఏర్పాటు చేయాలి

ప్రసంగిస్తున్న మహాదేవ్ విద్రోహి, వెదిరె అరవింద్‌రెడ్డి

రవీంద్రభారతి, ఏప్రిల్ 18: భూదాన్ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు పంచాలని, పేదలందరికీ భూములు దక్కేవరకు పోరాటం చేస్తామని 74వ భూదాన్ దినోత్సవంలో మహాదేవ్ విద్రోహి, వెదిరె అరవింద్‌రెడ్డి అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అఖిల భారత సర్వసేవా సంఘ్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో 74వ భూదాన్ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి అఖిల భారత సర్వసేవా సంఘ్ జాతీయ మేనేజింగ్ ట్రస్టీ మహాదేవ్ విద్రోహి, అధ్యక్షుడు వెదిరె అరవింద్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ట్రస్టీ తొలుపునూరి కృష్ణాగౌడ్, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, ఆనాడు వేల ఎకరాల భూదానం చేసిన భూదాన దాతల కుటుంబ సభ్యులు డాక్టర్ ప్రబోధ్ చంద్రారెడ్డి, సురవరం కృష్ణవర్ధన్ రెడ్డి, సాగర్ రెడ్డి, మల్లు కరుణ, భీంరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆరుట్ల సుశీలాదేవి, రావి ప్రతిభ, మమత, సర్వసేవా సంఘ్ రాష్ట్ర నాయకులు గరిగంటి రమేశ్ పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి భూదాన్ యజ్ఞబోర్డు ఏర్పాటు, భూమి పంపిణీ గురించి విజ్ఞప్తి చేస్తామన్నారు. పేదలకు పంచాల్సిన భూదాన్ భూములు ఇంజినీరింగ్ కళాశాలలకు, కంపెనీలకు, గోశాలలకు పంచడం అన్యాయమన్నారు. నకిలీ పత్రాలను సృష్టించి కాజేసిన గున్నా రాజేందర్ రెడ్డిపై సీబీఐ విచారణ చేపట్టి, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పలుకే బంగారం.. పదమే సింగారం

**జార్జియాలో తెలుగుభాషా పోటీలు**

మియాపూర్, ఏప్రిల్ 18 : సిలికానాంధ్ర మనబడి ఆధ్వర్యంలో అమెరికా దేశం జార్జియా రాష్ట్రం అట్లాంటా నగరంలోని అట్లాంట తెలుగు శాఖ ఆధ్వర్యంలో బుధవారం చిన్నారులకు తెలుగు మాట్లాడే పోటీలను నిర్వహించినట్లు ప్రతినిధులు నగేశ్, సుచేత, గాయత్రీ తెలిపారు. పోటీలలో కనపర్తి మేఘన, గంప శ్రేయాస్, క్రామ క్రిస్, మేధా శరణ్, వాయుగుండ్ల అమృత, కొప్పుల సంహిత, కొప్పుల సాయిసాత్విక్, గుండ్ర ఆశ్రిత్, కాశీభట్ల సత్యఈశాన చరిత్ , మద్దినేని మోనిశ్ , ప్రణవ, సిద్ధార్థరెడ్డి, స్వస్తిక్, మల్లాది కార్తిక్‌లకు బహుమతుల ప్రదానం చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో భగ్గుమన్న విభేదాలు

- బాహాబాహీకి దిగిన నాయకులు, కార్యకర్తలు
- డౌన్‌డౌన్ నినాదాలతో దద్దరిల్లిన సభా ప్రాంగణం
- అక్కడి నుంచి జారుకున్న అభ్యర్థి సునితామహేందర్ రెడ్డి, మధుయాష్కీ గౌడ్
- జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డిలు పరస్పరం నిందారోపణలు

చంపాపేట, లింగోజిగూడ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాలనీ సంఘాల సమావేశంలో వాగ్వాదానికి దిగిన లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి వర్గీయులు

ఎల్బీనగర్, ఏప్రిల్ 18 : ఎన్నికల ప్రచార సభల నేపథ్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఒకరినొకరు దూషించుకోవడంతో పాటు బాహాబాహీకి దిగారు. పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, మల్కాజిగిరి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునితామహేందర్‌రెడ్డి, తెలంగాణ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి సమక్షంలో పార్టీ ఏకైక కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ప్రసంగాల్లో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. అంతటితో ఆగకుండా బాహాబాహీకి దిగారు. గురువారం చంపాపేట, లింగోజిగూడ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాలనీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మల్కాజిగిరి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, తెలంగాణ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలతో పాటుగా స్థానిక లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యదర్శి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇతర డివిజన్ల కంటే లింగోజిగూడ, చంపాపేట డివిజన్లలో తక్కువ ఓట్లు వచ్చాయని, ఈ మారు అలా కాకుండా పార్లమెంటు ఎన్నికల్లో బాగా పనిచేసి 12వేల ఓట్లకు పైగా వచ్చేలా చేయాలని అన్నారు. దీనికి సమాధానంగా లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమ డివిజన్ గురించి వేరేవారు మాట్లాడటం తగదని, వారు తమ డివిజన్ల పరిస్థితిని చూసుకోవాలంటూ పేర్కొన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం మొదలైంది. ఈ క్రమంలో జక్కిడి ప్రభాకర్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ దరిపల్లి వర్గీయులు నినాదాలు చేయడంతో వివాదం మరింత ముదిరింది. ఇరువురు నాయకుల అనుచరులు రెండు గ్రూపులుగా మారి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకునే క్రమంలో తోపులాట జరిగింది. ఈ సందర్భంగా జక్కిడి శివచరణ్‌రెడ్డి గత ఎన్నికల్లో దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకుడు సుధీర్‌రెడ్డికి కోవర్టుగా పనిచేశాడంటూ ఆరోపణలు చేయడంతో వివాదం మరింత ముదిరింది. దీంతో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్ రెడ్డి, మధుయాష్కీ గౌడ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన నాయకుల మధ్య విభేదాలు బహిర్గతం కావడంతో పార్టీ శ్రేణులు, కార్యకర్తలంతా విస్తుపోతున్నారు.

## మత్స్య పారిశ్రామిక సంఘాలను బలోపేతం చేసుకోవాలి

**శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్**

నారాయణగూడలో పలువురికి నియామక పత్రాలను అందజేస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 18: రాష్ట్రంలోని ముదిరాజ్ కులస్తులు సంఘటితంగా ముందుకు సాగి మత్స్య పారిశ్రామిక సంఘాలను బలోపేతం చేసుకుని కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. గురువారం నారాయణగూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 33 జిల్లాల కమిటీలను చైతన్యం చేసి సంఘాలు ఏర్పాటు చేసుకుంటే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుర్రాల మల్లేశం ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికాంత్, రాష్ట్ర యువత అధ్యక్షుడిగా పండుగ బాలు, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి బండి సతీష్, రాష్ట్ర కార్యదర్శి మేకల రవీందర్‌లను నియమిస్తూ వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు మందుల వరలక్ష్మి, అధ్యయన వేదిక చైర్మన్ నీల రాములు, రాష్ట్ర నాయకులు బల్ల సత్తయ్య, యాదగిరి, డాక్టర్ బోళ్ల వెంకట్, కనకయ్య, రవీందర్, పోలు లక్ష్మణ్, మల్లికార్జున్, బండారి రమేశ్, నాగరాజు, గుంటుక శంకర్, సురేష్, విజయ్‌కుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జ్‌పోర్టు యూనివర్సిటీతో జేబీ విద్యాసంస్థల ఒప్పందం



బ్రిడ్జ్‌పోర్టు యూనివర్సిటీతో ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న జేబీ విద్యా సంస్థ బృందం

మొయినాబాద్, ఏప్రిల్ 18: జేబీ విద్యా సంస్థల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో జేబీఐఈటీతో ఎంఓయూ చేసుకున్నట్లు బ్రిడ్జ్‌పోర్టు యూనివర్సిటీ అధ్యక్షురాలు డెనియల్ విల్కెన్ అన్నారు. జేబీ విద్యా సంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు మాట్లాడుతూ.. అమెరికాలో టాప్‌లో ఉన్న బ్రిడ్జ్‌పోర్టు యూనివర్సిటీ తెలంగాణలో మొట్టమొదటి సారిగా జేబీ విద్యా సంస్థలతో ఎంఓయూ చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రిడ్జ్‌పోర్టు యూనివర్సిటి ఇన్నోవేషన్, స్ట్రాటజి, వైస్ ప్రెసిడెంట్ ఎలెనా కాహిల్, తదితరులు పాల్గొన్నారు.

## 'ఆయుర్వేద వైద్యులు సంస్కృత భాషను అభ్యసించాలి'

వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 18 : ఆయుర్వేద వైద్యులందరూ సంస్కృత భాషను తప్పనిసరిగా అభ్యసించాలని సంస్కృత అకాడమి డైరెక్టర్ ప్రొఫెసర్ నీలకంఠం సూచించారు. ఆయుర్వేద చికిత్సా విధానమంతా వేల సంవత్సరాల క్రితమే సంస్కృత భాషలో రచించారని చెప్పారు. ఆ శాస్త్రాన్ని ఆంగ్లేయులు వారి భాషలోకి అనువదింపజేసుకుని, అభ్యసించి, వైద్య శాస్త్రమంతా ముందుగా తాము కనుగొన్నదేనని ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని సంస్కృత అకాడమీలో 'ఆయుర్వేదం – పంచగవ్య చికిత్సా విధానం'అనే అంశంపై గురువారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్ ప్రారంభోత్సవానికి అధ్యక్షతన వహించిన ప్రొఫెసర్ నీలకంఠం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారతీయ చికిత్సా విధానాన్ని, సంస్కృత భాష అధ్యయనాన్ని ప్రోత్సహించాలని కోరారు. ప్రముఖ జర్నలిస్టు రాకా సుధాకర్‌రావు మాట్లాడుతూ సర్వశాస్త్రాలకు మూలం సంస్కృతమని అన్నారు. పంచగవ్య చికిత్సా విధానానికి సంబంధించిన సుప్రసిద్ధ వైద్యులు డాక్టర్ మురళీధరరావు, డాక్టర్ సుదర్శన్‌సింగ్, డాక్టర్ సురేఖ, రాష్ట్రపతి పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ పద్మ తదితరులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రసంగించారు. రెండేళ్లుగా సంస్కృతం ద్వారా ఆయుర్వేదం క్లాసులు నిర్వహిస్తున్న డాక్టర్ జోషి సంతోష్‌కుమార్ ఈ వర్క్‌షాప్ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

## పరిశోధన.. బోధన కలిస్తే..అద్భుత ఫలితాలు

టెక్నోస్మానియా వేడుకలను ప్రారంభిస్తున్న ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 18 : ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ప్రతి సంవత్సరం నిర్వహించే 'టెక్నోస్మానియా–2024' గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ పోటీలలో దేశవ్యాప్తంగా వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారు. ఇందులో భాగంగా పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, క్విజ్, సింగింగ్, డ్యాన్సింగ్, షార్ట్ ఫిల్మ్ మేకింగ్, ట్రెజర్ హంట్ తదితర విభాగాలలో మూడు రోజుల పాటు పోటీలు జరుగనున్నాయి. ఈ వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింత సాయిలు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధి సాంకేతిక విద్యార్థులపైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. విద్యార్థులు మన దేశంలో ఉన్న ఉన్నత విద్యాసంస్థలలో చదివి బోధనా రంగం వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. పరిశోధనలు, బోధన కలిసి పని చేస్తే అద్భుత ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింత సాయిలు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని చెప్పారు. టెక్నోస్మానియా కన్వీనర్ ప్రొఫెసర్ శ్రీను నాయక్ మాట్లాడుతూ కళాశాలలోని కెమికల్ టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ, ఫార్మసీ, హోటల్ మేనేజ్‌మెంట్ విభాగాలలో వరుసగా కెటాలసిస్, ఫుడ్ సినర్జిజం, టెక్స్‌క్రోమా, టెక్నోఫార్మా, టెక్నోహాస్పిటాలిటీ పేర్లతో పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో తీవ్ర నీటి సంక్షోభం తలెత్తిందని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో మన రాష్ట్రంలోనూ ఆ పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అందుకే 'సేవ్ వాటర్' థీమ్‌తో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమేశ్‌కుమార్, ప్రొఫెసర్లు బసవరావు, రాజం, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎ.పరుశురాం, డాక్టర్ పరమేశ్వర్లు, డాక్టర్ ఐలయ్య, డాక్టర్ వి.భాస్కర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అనిత, స్టూడెంట్ కోఆర్డినేటర్లు రేగ శ్యాంసుందర్, మాధవి, ఆకాశ్, అఖిల, ముఖేశ్, సాహిత్య, సూరిదుర్గ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## జేఎల్‌ఎం రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు

ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న జేఎల్‌ఎం అభ్యర్థులు...

కవాడిగూడ, ఏప్రిల్ 18 : జూనియర్ లైన్‌మెన్ పరీక్షలో మంచి మార్కులు తెచ్చుకున్న అభ్యర్థులందరినీ వెంటనే విధుల్లోకి తీసుకొని తమకు న్యాయం చేయాలని జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం) 1.2 అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నచౌక్ వద్ద జూనియర్ లైన్‌మెన్ అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు జానీ, ఆర్.హుస్సేన్, రమేశ్, ప్రేమ్, బాలరాజ్ మాట్లాడుతూ జేఎల్‌ఎం రిక్రూట్‌మెంట్‌లో భారీ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తక్షణమే తమకు న్యాయం చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు.